# సాక్షి ఖమ్మం


శుక్రవారం | 25 | జూలై | 2025






### ... ముగిసిన క్రీడాపోటీలు

పాలేరులోని నవోదయ విద్యాలయలో రెండు రోజులుగా వివిధ విభాగాల్లో జరుగుతున్న క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. 8లో



### జిల్లాను వీడని ముసురు

జిల్లాలో గురువారం కూడా వర్షం కొనసాగగా రిజర్వాయర్లు, చెరువుల్లోకి వరద చేరి అలుగు పోస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం

26° / 23°

### వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఉపకార వేతనాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీ విద్యార్థులు 2025–26 ఏడాదికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బి.పురంధర్ సూచించారు. దరఖాస్తుకు సెప్టెంబర్ 30వరకు గడువు ఉందని తెలిపారు. అలాగే, 2023–24, 2024–25 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను కళాశాల యాజమాన్యాలు ఈనెల 31లోగా అందజేయాలని ఆయన ఆదేశించారు.

### సహచరుల కుటుంబాలకు ఎక్సైజ్ ఉద్యోగుల చేయూత



హెడ్ కానిస్టేబుల్ కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న డీసీ జనార్దన్‌రెడ్డి

ఖమ్మంక్రైం: ఎక్సైజ్‌శాఖలో హెడ్ కానిస్టేబుళ్లు లింగా, చంద్రు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలకు ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు అండగా నిలిచారు. ఈమేరకు ఉద్యోగులు తమ రెండు రోజుల వేతనాన్ని వారి కుటుంబాలకు అందజేశారు. ఇందులో భాగంగా లింగా, చంద్రు కుటుంబాలకు రూ.5.32లక్షలను గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఖమ్మంలో అందజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఏఈఎస్‌లు తిరుపతి, వేణుగోపాల్‌రెడ్డితో పాటు సీఐలు, ఎస్‌ఐలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్‌లో భూభారతి దరఖాస్తులు



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కొణిజర్ల: భూభారతి గ్రామసభల్లో అందిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కొణిజర్ల తహసీల్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన దరఖాస్తుల వివరాలు ఆరా తీశారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాక నిబంధనల మేరకు పరిష్కారంపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, దరఖాస్తుదారులకు భూభారతి ఆన్‌లైన్ పోర్టల్‌లో నోటీసులు జారీ చేయాలని ఆయన సూచించారు. తహసీల్దార్ నారపోగు అరుణ, డిప్యూటీ తహసీల్దార్ రాముతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

### మధిర ట్యాంక్‌బండ్ అభివృద్ధికి రూ.6.02 కోట్లు

మధిర: మధిరలోని పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గురువారం రూ.6.02 కోట్ల నిధులను మంజూరు చేసింది. ట్యాంక్ బండ్ వద్ద పర్యాటకులకు సదుపాయాల కల్పనలో భాగంగా కాటేజీలు, రెస్టారెంట్, విశ్రాంతి గదులు నిర్మించనుండగా, పిల్లలకు ఆటపరికరాలు ఏర్పాటుచేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఈ నిధులు మంజూరు కాగా, పనులు పూర్తయితే ట్యాంక్ బండ్ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారనుంది.

### 'పీఎం-జన్‌మన్' పురోగతి ఎలా ఉంది?



ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాన మంత్రి ఆదివాసీ న్యాయమహా అభియాన్ (పీఎం-జన్‌మన్) పథకం ద్వారా ఏయే పనులు చేపట్టారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. అలాగే, దుర్బల గిరిజన సమూహా(పీవీటీజీ)ల పురోగతిపై ఆయన ఆరా తీశారు. ఈ అంశాలపై కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వెనకబడిన గిరిజన నివాస ప్రాంతాల్లో పక్కా ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, వైద్యశిబిరాల నిర్వహణ, మొబైల్ టవర్ల ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఆదివాసీ గిరిజన ప్రాంతాలకు రూ.24 వేల కోట్లు కేటాయించగా.. ప్రాధాన్యతాక్రమంలో రాష్ట్రాల వారీగా పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఈమేరకు తెలంగాణలో 3,884 పనులు చేపట్టగా 41 శివారు గూడెంల్లో ఆదివాసీలకు మేలు జరుగుతోందని మంత్రి తెలిపారు.













# ఇంట్లో ఈగలు.. బయట దోమలు

**గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో జనాల అవస్థ**

- డ్రెయినేజీలు లేక రోడ్లు, ఖాళీస్థలాల్లోనే నిల్వ
- తాజా వర్షంతో బురదమయమవుతున్న వీధులు
- చెత్త, దుర్వాసనకు తోడు వ్యాధుల భయంతో ప్రజల బెంబేలు

జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపై పారుతుండగా.. ఉన్న చోటా నెలల తరబడి పూడిక తీయక మురుగు రహదారులపైకి చేరుతోంది. దీనికితోడు సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో వర్షపు నీరు.. మురుగు నీరు కలగలిపి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతేకాక దోమలు, ఈగల మోతతో సతమతవుతున్న పలు గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధుల భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

**పర్యవేక్షణ లేక..**

జిల్లాలో 20మండలాల్లో 571 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అయితే, పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర దాటడంతో పంచాయతీ కార్యదర్శులే పాలనా బాధ్యతలు చూస్తున్నారు. గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించినా వారు నిర్వర్తించే విధులతోనే సరిపోతుండడంతో గ్రామాలను కన్నెత్తి చూడడం లేదు. దీనికి తోడు నిధుల లేమి కారణంగా పంచాయతీ కార్యదర్శులు సైతం పారిశుద్ధ్య పనులను పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. డ్రెయిన్లు ఉన్నచోట పూడిక తీయక, ట్రాక్టర్లు ఉన్నా చెత్త తరలించడం లేదని తెలుస్తోంది. జిల్లాలో సుమారు 2వేల కి.మీ. మేర 5,099 డ్రెయిన్లు ఉండగా ఇందులో చాలావరకు పూడిక తీయక ఏళ్లు దాటుతోంది. దీంతో చిన్నపాటి వర్షానికే డ్రెయిన్ల నుంచి నీరు రోడ్లపైకి చేరుతోంది. ఫలితంగా దుర్వాసన మాటేమో కానీ కనీసం వీధుల్లో నడవాలంటే నరకప్రాయంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు లేవు...**

గ్రామపంచాయతీల్లో చెత్త తొలగింపు, డ్రెయినేజీల వ్యవస్థ సరిగ్గా లేక పలు ప్రాంతాల్లో మురుగు పేరుకుపోయి దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. కనీసం రోజు విడిచి రోజైనా చెత్త తరలించాల్సి ఉన్నప్పటికీ చాలా గ్రామాల్లో నెలలు దాటినా పట్టించుకోవడం లేదు. సిబ్బంది కొరత, నిధుల లేమిని కార్యదర్శులు సాకుగా చూపుడడంతో గ్రామస్తులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది.

**డ్రెయినేజీలు నిర్మించాలి..**



బీసీ కాలనీలో సైడ్ డ్రెయిన్ లేక వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఈ కారణంగా రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. అంతేకాక దోమలు, ఈగలతో జ్వరాల బారిన పడుతున్నాం. డ్రెయినేజీలు నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– షేక్ ఇస్మాయిల్, ముష్టికుంట్ల, బోనకల్ మండలం

**అధ్వానంగా పారిశుద్ధ్యం..**



మర్లపాడులో ప్రధాన, అంతర్గత రహదారుల వెంట డ్రెయినేజీలు లేవు. రింగ్ సెంటర్‌లో మురుగునీరు రోడ్లపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశమున్నందున అధికారుల దృష్టి సారించాలి.

– గొర్ల రామ్మోహన్‌రెడ్డి, మర్లపాడు, వేంసూరు మండలం

## అర్హులందరికీ న్యాయం చేస్తాం...

- ప్రతీ రహదారి అభివృద్ధి నా బాధ్యత
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన ఐడీసీ విజయ్‌బాబు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఈ విషయంలో ఎవరూ అపోహలకు గురికావొద్దని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట, 59వ డివిజన్ దానవాయిగూడెంతో పాటు ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు, ఊటవాగుతండా, మంగళగూడెంలో రహదారుల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, ఖమ్మంలో 1, 59, 60వ డివిజన్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశాక మంత్రి మాట్లాడారు. ప్రజల దీవెనలతో ఏర్పడిన తమ ప్రభుత్వం అనేక హామీలను ఇప్పటికే అమలుచేసిందని తెలిపారు. మూడు డివిజన్లలో రహదారుల నిర్మాణానికి రూ.24 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే, పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులను కూడా సీసీగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**త్వరలోనే రెండో విడత**

ప్రస్తుతం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే రెండో విడత మంజూరు ఉంటుందని.. ఇలా ఏటా మూడు విడతలుగా ఇళ్లు మంజూరు ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ఎవరు కూడా దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాగా, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపడుతుండగా దఫాల వారీగా బిల్లులు మంజూరవుతాయని పొంగులేటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడగా ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, వివిధ శాఖల ఈఈలు కృష్ణలాల్, రంజిత్, పవార్, వాణిశ్రీ, డీఈ మహేష్‌బాబుతో పాటు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్ మార్చేది ఉపాధ్యాయులే..

- సెప్టెంబర్ నుంచి ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా





మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: పిల్లల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి తరగతి గదిలో విద్యార్థులతో మమేకమవుతూ పాఠాలు బోధించాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఆమె విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజలతో కలిసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా యోగితారాణా మాట్లాడుతూ రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలను తనిఖీ చేశామని తెలిపారు. సింగరేణి మండలం కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చొరవతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని నమ్మకం కలిగిందన్నారు. అలాగే, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది 140 మంది విద్యార్థులు కొత్తగా చేరడం ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాలలకు వచ్చే పిల్లలకు నేర్పించేదే వారి జీవితంలో కీలకంగా మారుతుందని చెప్పారు. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తూ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. డీఈఓలు, ఎంఈఓలు తరచూ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలని, ఐఏ ల్యాబ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. ఇదే సమయాన పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో హాజరయ్యేలా పర్యవేక్షిస్తూ వారి హాజరును ఫేస్ రికగ్నేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా నమోదు చేయాలని సూచించారు. అలాగే, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలల సమీపాన అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలను చేర్పించాలని సూచించిన ఆమె... పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు సెప్టెంబర్ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించి స్నాక్స్ సమకూర్చాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులందరికీ కార్డులు జారీ చేయించాలని సూచించారు. అనంతరం విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడగా ఎస్సెస్సీలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన, మూతబడిన స్కూళ్లు తెరిపించిన, అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన మండలాల ఎంఈఓలను సన్మానించారు. ఈ సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రెయినీ కలెక్టర్ సౌరభశర్మ, విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు రమణకుమార్, రాజీవ్, సత్యనారాయణరెడ్డి, మదన్‌మోహన్, వెంకటనర్సమ్మ, డాక్టర్ హెచ్.హరీష్, మంజరి, డీఈఓ సత్యనారాయణ, నాలుగు జిల్లాల విద్యాశాఖ అధికారులతో పాటు జి.సురేష్, ప్రాంజలి పాఠక్, తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలుచేయాల్సిందే...

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ**



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకే కాక ఇతర చేయూత లబ్ధిదారులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఖమ్మం జెడ్పీ సెంటర్ నుండి టీఎన్జీవోస్ హాల్ వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించగా, ఆతర్వాత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వడంతోపాటు వృద్ధులు, వితంతువులు, నేత, గీత, బీడీ కార్మికుల పింఛన్ పెంచుతామని ప్రకటించిన కాంగ్రెస్ ఆతర్వాత హామీని తుంగలో తొక్కిందని ఆరోపించారు. హామీల అమలు సాధ్యం కాకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆగస్టు 13న హైదరాబద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే మహాగర్జనకు జిల్లా నుంచి పెన్షన్‌దారులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) నాయకులు సామినేని భవానిచౌదరి, కందికట్ల విజయ్, కూచిపూడి సత్యం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేనెలలో రోప్‌వే పనులు ప్రారంభం

- కోల్‌కతాలో సిద్ధమవుతున్న విడిభాగాలు
- 2026 నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా కేంద్రంలోకి ఖిలాపైకి చేరేలా నిర్మించే రోప్‌వే పనులు ఆగస్టులో మొదలుకానున్నాయి. ఇందుకోసం రూ.29 కోట్లు కేటాయించగా, మున్సిపల్ శాఖ, సుడా నుంచి పర్యాటక శాఖకు నిధులు సమకూర్చాయి. ఈమేరకు నిర్మాణ బాధ్యతలను కోల్‌కతాకు చెందిన కాన్‌వేయర్ అండ్ రోప్‌వే సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. దీంతో ఖిలా వద్ద ప్రత్యక్షంగా పరిశీలించిన కంపెనీ బాధ్యులు రోప్ వే, బ్యాటరీ క్యాబిన్లు అక్కడే సిద్ధం చేస్తున్నారు. రోప్‌వేలో భాగంగా లోయర్ స్టేషన్, అప్పర్ స్టేషన్‌ను అక్కడే సిద్ధం చేసి విడిభాగాలుగా తీసుకొచ్చి ఖిలా వద్ద అమర్చనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ పనులు ఆగస్టు 15తర్వాత మొదలయ్యే అవకాశముండగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు కంపెనీ బాధ్యులతో సమీక్షిస్తున్నారు.

**పర్యాటక కేంద్రంగా...**

ఖమ్మంలోని ఖిలాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల నిర్ణయించారు. ఇందుకోసం రోప్ వే నిర్మించి ఖిలాపైకి చేరేలా బ్యాటరీ క్యాబిన్లు అమర్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆరుగురు కూర్చుని పైకి వెళ్లగలిగే సామర్థ్యంతో నాలుగు క్యాబిన్లు ఏర్పాటుచేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.29కోట్లు కేటాయించగా ఇందులో రోప్‌వే పనులకు రూ.15.15కోట్లు వెచ్చిస్తారు. మిగతా నిధులతో ఖిలా సుందరీకరణ, గుట్టపై అమ్యూజ్‌మెంట్ పార్కు, మినీ సినిమా థియేటర్ నిర్మిస్తారు. 2026 సంవత్సరానికి ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలనేది లక్ష్యం కాగా.. నగరవాసులకే కాక చుట్టుపక్కల ప్రజలకు కొత్త పర్యాటక కేంద్రం అందుబాటులోకి రానుంది. ఈ విషయమై డీఈఈ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ రోప్‌వే పనులను నిర్ణీత గడులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోప్‌వేతో పాటు ఖిలా సుందరీకరణపైనా దృష్టి సారించామని వెల్లడించారు.

## యూరియా కోసం రైతుల పాట్లు

వర్షాలు జోరందుకోవడంతో పంటల అవసరాల కోసం రైతులు యూరియా కొనుగోలుకు బారులు దీరుతున్నారు. దీనికి తోడు చాలాచోట్ల సరిపడా యూరియా లేకపోవడం, కొరత ఎదురవుతుందనే ప్రచారంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మేరకు చింతకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్దకు గురువారం ఉదయం 8గంటలకే పెద్దసంఖ్యలో రైతులు చేరుకున్నారు. కార్యాలయం తెరవకముందే వచ్చిన వారు క్యూలో నిలుచునే ఓపిక లేక ఇలా వరుస క్రమంలో చెప్పులు పెట్టి పక్కన కూర్చున్నారు. – చింతకాని



పీఏసీఎస్ వద్ద క్యూలో పెట్టిన చెప్పులు

## కొలువుదీరనున్న కలియుగ దైవం

- టీటీడీ ఆధ్వర్యాన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కసరత్తు
- ఖమ్మంలో పర్యటించిన టీటీడీ బృందం



టీటీడీ బృందంతో చర్చిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కసరత్తు మొదలైంది. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన ఖమ్మం పట్టణానికి సమీపాన ఆలయం నిర్మించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టీటీడీ చైర్మన్‌ను కోరగా సానుకూల స్పందన లభించింది. ఈమేరకు గురువారం జిల్లాకు వచ్చిన టీటీడీ అధికారులు మంత్రితో సమావేశం కావడంతో పలుచోట్ల అనువైన స్థలాలను పరిశీలించారు. టీటీడీ స్థపతి రవికాంత్ నేతృత్వాన ఎస్ఈ జగదీశ్వర్ రెడ్డి, ఈఈ సురేంద్రనాథరెడ్డి, డీఈ నాగభూషణం, ఈఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈ జగన్మోహన్‌రావు తదితరులు ఖమ్మం వచ్చారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు సైదులు, శ్వేత, ఉద్యోగులు వాహిద్, సత్యనారాయణ, సొసైటీల చైర్మన్లు రావూరి సైదబాబు, తాతా రఘురాంతో కలిసి అల్లీపురంలోని క్రషర్ మిల్ ఏరియా, నేషనల్ హైవే వెంట, రఘునాథపాలెం బైపాస్‌లో నర్సింహ చెరువుగుట్ట, పువ్వాడనగర్ సమీపాన భూములను పరిశీలించారు. సుమారు 15 – 20 ఎకరాల్లో ఆలయం, కల్యాణ మండపం అవసరమని పేర్కొన్న వారు స్థలాల లభ్యతపై ఆరా తీశారు.

**రూ.50 కోట్ల వ్యయంతో...**

ప్రాథమిక అంచనాల ప్రకారం ఖమ్మంలో రూ.50 కోట్ల వ్యయంతో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిసింది. ఆలయంతో పాటు కల్యాణ మండపం, గోశాల, యాత్రికుల వసతిగృహాలు ఇందులో ఉంటాయని సమాచారం. కాగా, పలు చోట్ల స్థలాలు పరిశీలించిన టీటీడీ అధికారులు ఖమ్మంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. కావాల్సిన స్థలం, ఆలయ నమూనాపై చర్చించగా.. అనువుగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి వారికి సూచించారు.

## కేజీబీవీల్లో బదిలీలకు అనుమతి



ఖమ్మం సహకారనగర్: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిలో దంపతులు(స్పౌజ్), పరస్పర(మ్యూచువల్) బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈమేరకు అర్హుల వివరాలను ఈనెల 26 లోగా పంపించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# శ్రావణం.. ఆధ్యాత్మికం

సకల శుభాలకు నిలయంగా భావించే శ్రావణ మాసం వచ్చేసింది. హిందువులకు శుభప్రదమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఈ నెలంతా పండుగలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలకు తోడు వివాహ ముహూర్తాలు ఉండడంతో ఆధ్యాత్మికత వెల్లివిరియనుంది. మహిళలు ప్రత్యేకంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతం, బోనాల వేడుకలే కాక రాఖీ పౌర్ణమి, నాగుల పంచమి ఈనెలలో రానున్నాయి. – ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి/సత్తుపల్లిటౌన్


ఖమ్మం గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు (ఫైల్)

### నేటి నుంచి శ్రావణమాసం

- నెలంతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు
- రేపటి నుంచి వివాహ ముహూర్తాలు

**పండుగల మాసం**

శ్రావణ మాసం అంతా పండుగల సందడి ఉంటుంది. ఈసారి శ్రావణంలో ఐదు శుక్రవారాలు వస్తుండగా, 29వ తేదీన మంగళగౌరి వ్రతాన్ని ప్రారంభిస్తారు. ఇదేరోజు నాగపంచమి కావడంతో నాగదేవతకు పూజలు చేయనున్నారు. అలాగే, ఆగస్టు 1న రెండో శుక్రవారం, 8న మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పండుగ, అదే రోజు జంధ్యాల పౌర్ణమి, 16న శ్రీ కృష్ణ జన్మాష్టమి, 23న రైతులు పొలాల అమావాస్య జరుపుకోనున్నారు.

**బోనాల పండుగ ప్రత్యేకం**

ఆషాఢ మాసంలో పలుచోట్ల అమ్మవార్లకు బోనాలు చెల్లిస్తుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శ్రావణ మాసంలో బోనాల పండుగ జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో వరినాట్లు ముగించుకుని అమ్మవార్లకు బోనాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

**వివాహాల సందడి**

శ్రావణమాసంలో శుభ ముహూర్తాలు ఉండడంతో పలువురు తమ పిల్లలకు వివాహాలు జరిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 26 నుంచి వివాహాలు, నిశ్చితార్థాలు, గృహాల శంకుస్థాపన, గృహ ప్రవేశాలు మంచి రోజులు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెల 26, 27, 30, 31వ తేదీలతోపాటు ఆగస్టు 1, 3, 4, 6, 7, 8, 9, 10, 11, 13, 14, 17, 18వ తేదీల్లో ముహూర్తాలు ఉండగా.. పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి.

**శుభ ప్రదమైన కాలం**



శ్రావణమాసం నుంచి శుభప్రదమైన కాలం ప్రారంభమవుతుంది. ఈ నెల వ్రతాలు, నోములకు ప్రత్యేకం. ఇళ్లు, ఆలయాలు ఆధ్యాత్మికతను సంతరించుకుంటాయి. వివాహాలు, గృహ శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు వంటి కార్యక్రమాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– మునగలేటి రమేష్ శర్మ, అర్చకుడు, ఖమ్మం

**చేతి నిండా పని...**



కొన్నాళ్లుగా ఎలాంటి పనులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు శ్రావణమాసంలో వివాహాలు జరగనుండడంతో మాకు చేతి నిండా పని లభిస్తుంది. ఇప్పటికే పలు వివాహాలకు ఆర్డర్లు బుక్ అయ్యాయి. ఇతర శుభ కార్యాలకు సైతం ఫొటోల కోసం పలువురు మమ్మల్ని సంప్రదిస్తున్నారు.

– జక్రిపోతుల సత్యనారాయణ, ఫొటోగ్రాఫర్, నేలకొండపల్లి

దీంతో ఇప్పటికే పలువురు ముహూర్తాలు కుదుర్చుకున్నారు. ఈ కారణంగా మండపాలు, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, వంట మనుషులకు డిమాండ్ పెరగనుంది. శ్రావణ మాసం తర్వాత వచ్చే భాద్రపద మాసం సెప్టెంబర్ 21 వరకు కొనసాగుతుండగా శూన్య మాసం కావటంతో ముహూర్తాలు ఉండవు. ఆ తర్వాత సెప్టెంబర్ 23 నుంచి ముహూర్తాలు ప్రారంభమై 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31వ తేదీలతో పాటు నవంబర్ 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27,29, 30వ తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. అనంతరం డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 6వరకు రెండు నెలల పాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

# అంతటా జలకళ!


వైరా రిజర్వాయర్ అలుగు ద్వారా వెళ్తున్న వరద

వైరా/వైరా రూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద చేరుతుండగా వైరా రిజర్వాయర్ నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 18.11 అడుగులు దాటడంతో నాలుగు అలుగుల ద్వారా వరద బయటకు వెళ్తోంది. ఇక రిజర్వాయర్ నుంచి దిగువకు వెళ్తున్న నీటితో వైరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. స్నానాల లక్ష్మీపురం–కేజీసిరిపురం మధ్య ఉన్న లోలెవల్ వంతెన పైకి నీరు చేరింది.

**ఖమ్మంమయూరిసెంటర్:** రెండు రోజులుగా ఖమ్మం జిల్లాతోపాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో మున్నేటికి వరద పెరిగింది. ఖమ్మం కాల్వొడ్డు వద్ద గురువారం 10 అడుగుల మేరకు వరద ప్రవహించింది. ఈ ఏడాది మున్నేరుకు ఈ స్థాయి వరద రావడం ఇదే ప్రథమం. ఈమేరకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీవాహక ప్రాంత ప్రజలకు సూచనలు చేస్తున్నారు.

**కొణిజర్ల:** రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మల్లుపల్లి, తీగలబంజర వద్ద పగిడేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోలెవల్ బ్రిడ్జి వద్దకు నీరు చేరడంతో మళ్లీ భారీ వర్షం కురిస్తే ఏరు పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి.


కొణిజర్ల మండలం మల్లుపల్లి వద్ద పగిడేరు ఉధృతి


తల్లాడ మండలం మల్లవరం పెద్ద చెరువు అలుగు

**తల్లాడ:** తల్లాడ మండలంలో పలు చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. మల్లవరం పెద్ద చెరువు, చిన్న చెరువు, తల్లాడ ఎదుళ్ల చెరువు, గుంటు చెరువు, బిల్లుపాడు, నూతనకల్ నాగులు చెరువు, మిట్టపల్లి, ముద్దునూరు చెరువులు నిండాయి.


ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేటి వరద ప్రవాహం

## క్లుప్తంగా

### నవోదయలో ముగిసిన క్రీడాపోటీలు


మార్చ్‌ఫాస్ట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కూసుమంచి: మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగిసింది. ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను త్వరలో జరగనున్న రీజినల్ పోటీలకు ఎంపిక చేశారు. క్లస్టర్ మీట్‌లో పాలేరు నవోదయ విద్యార్థులతో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నవోద య విద్యాలయాల నుంచి 345 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 234 మంది రీజినల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14, 17, 19 విభా గాల్లో బాలబాలికలకు బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, ఖో–ఖో, యోగా పోటీలు నిర్వహించగా పాలేరు, నల్లగొండ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో పాటు వివిధ క్రీడల్లో సత్తా చాటారు. కాగా, రీజినల్ స్థాయి పోటీల్లో భాగంగా కరీంనగర్‌లో ఖో–ఖో, కాకినాడలో కబడ్డీ, కేరళలో బ్యాడ్మింటన్, కర్ణాటకలో చెస్, తూర్పుగోదావరిలో టేబుల్ టెన్నిస్, గుంటూరులో యోగా పోటీలు జరుగుతాయని పాలేరు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు.

### కుటుంబీకుల చెంతకు నేపాల్ వాసి

- అప్పగించిన అన్నం ఫౌండేషన్


జడ్జి చంద్రశేఖర్‌రావు సమక్షాన మిథున్‌ను కుటుంబానికి అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న నేపాల్ వాసిని చేరదీసి కోలుకున్నాక వివరాలు సేకరించి కుటుంబీకులకు అప్పగించిన ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మానవత్వాన్ని చాటారు. ఖమ్మం జిల్లా ఏన్కూరులో మే 5వ తేదీన మతిస్థిమితం లేని వ్యక్తి ఒంటిపై బట్టలు లేకుండా తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పోలీసుల ద్వారా అందిన సమాచారంతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు వెళ్లి తమ వాహనంలో ఆయనను ఆశ్రమానికి చేర్చారు. అక్కడ వైద్యం చేయించడంతో సదరు వ్యక్తి కోలుకున్నాడు. ఆపై వివరాలు ఆరా తీయగా నేపాల్ దేశం పర్సా జిల్లాలోని విశ్వబంజరి గ్రామానికి చెందిన తన పేరు మిథున్ సహానీ మహతో అని చెప్పాడు. అలాగే, కుటుంబీకుల ఫోన్ నంబర్ ఇవ్వగా శ్రీనివాసరావు సమాచారం ఇవ్వడంతో మిథున్ సోదరుడు ఆకాష్య సహానీ, బంధువులు ఖమ్మం వచ్చారు. దీంతో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సమక్షాన గురువారం వారి గుర్తింపు పత్రాలను పరిశీలించి మిథున్‌ను వారికి అప్పగించగా కృతజ్ఞతలు తెలిపారు.

### కేటీఆర్‌కు ఎంపీల శుభాకాంక్షలు


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, దామోదర్ రావు హైదరాబాద్‌లో గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి మాట్లాడారు.

### 19మంది ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

ఖమ్మం సహకారనగర్: జిల్లా రెవెన్యూ శాఖలో 19మంది ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ధరణి ఆపరేటర్లను పెద్దసంఖ్యలో బదిలీ చేయగా, ఆదేస్థాయిలో ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేయడం గమనార్హం.

### 27న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 27న కల్లూరులోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్–8, 10, 12, 14, 16, 18, 20 విభాగాలతో పాటు పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు ఆగస్టు 7వ తేదీన జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

# అక్రిడిటేషన్లపై త్వరలోనే విధివిధానాలు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి, యూనియన్ నాయకులు

**టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి**

వైరా: రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడడంలో జర్నలిస్టుల పాత్రను విస్మరించలేమని రాష్ట్ర రెవెన్యూ సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీపై త్వరలోనే విధివిధానాలు ప్రకటిస్తామని తెలిపారు. వైరాలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(టీయూడబ్ల్యూజే) జిల్లా నాలుగో మహాసభ గురువారం జరగగా మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలోనే కాక గత 18 నెలలుగా తమ పాలన సజావుగా సాగడంలో జర్నలిస్టుల సహకారం ఉందన్నారు. జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ రెండు, మూడు రోజులలో మొదలుపెడతామని, వాటికి అనుసంధానంగా హెల్త్‌కార్డులు సైతం జారీ చేస్తామన్నారు. ఇళ్ల స్థలాల విషయమై న్యాయ నిపుణుల సలహా తీసుకుంటామని మంత్రి తెలిపారు. తొలుత ఈ సభలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అన్ని రంగాలతో పోలిస్తే జర్నలిజం ప్రాధాన్యత కలిగి ఉందని తుమ్మల చెప్పారు.

**జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు**



టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడిగా ఏనుగు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అలాగే, కార్యదర్శిగా మైసా పాపారావుతో పాటు మిగతా కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సభలో వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, కె.రాంనారాయణ, నాయకులు వనం వెంకటేశ్వర్లు, రాంనారాయణ, నర్వనేని వెంకట్రావు, సైదులు, వేణు, మురారి, పులి కృష్ణార్జునరావు, కొత్తా వెంకటేశ్వరరావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, అక్కిశెట్టి రవితేజ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### 'కాంగ్రెస్ వారికేనా ఇందిరమ్మ ఇళ్లు?'


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

బోనకల్: కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కాకుండా ఆ పార్టీ వారికే కట్టబెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ఆరోపించారు. బోనకల్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఉండడమే ఇందిరమ్మ ఇళ్లకు అర్హతగా గుర్తిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తే, అర్హులందరికీ ఇళ్లు చెప్పినా ఆచరణకు నోచుకోవడం లేదని తెలిపారు. అలాగే, గోవిందాపురం(ఎల్)లో అధికారుల ముందే కాంగ్రెస్ శ్రేణులు దౌర్జన్యాలకు పాల్పడినా చర్యలు తీసుకోవడం లేదని పోతినేని విమర్శించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, నాయకులు చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు, కిలారు సురేష్, పాపానేని రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను వీడని ముసురు...

**రోజంతా ఎడతెరిపి లేని వర్షం**

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మంగళ, బుధ వారాలతో పోలిస్తే గురువారం వర్షం కొద్దిమేర తగ్గినా జల్లులు కొనసాగాయి. అయితే, ఎగువన కురిసిన వానలతో వాగుల్లో ప్రవాహం పెరుగుతోంది. బుధవారం జిల్లా సగటు వర్షపాతం 54.4 మి.మీ., గురువారం 12.0 మి.మీ.గా నమోదైంది. గురువారం ఉదయం 8–30 గంటల వరకు కారేపల్లిలో అత్యధికంగా 58.6 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఇక గురువారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పెనుబల్లిలో 18.3, సత్తుపల్లి 13.8, సత్తుపల్లి ఓసీ వద్ద 12.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖమ్మం వద్ద మున్నేటిలో నీటి మట్టం పెరుగుతుండగా, వైరా రిజర్వాయర్ నిండి అలుగు పోస్తుంది. మిగతా చోట్ల ప్రాజెక్టులు, చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టం స్థాయికి చేరాయి. ఈ వర్షంతో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

**అప్రమత్తంగా ఉండాలి**

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంక్రైం: మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనే సూచనల నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెరువులు, కుంటల వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ ప్రజలకు అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశించినట్లు సీపీ తెలిపారు. అలాగే, వరద ముంచెత్తితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా బోట్లు, డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, ప్రజలు కూడా కల్వర్టులు, బ్రిడ్జిలపై వరద ప్రవహిస్తుండగా దాటే ప్రయత్నం చేయొద్దని, జలపాతాల వద్ద సెల్ఫీల కోసం పోయి ఆపదలో చిక్కుకోవద్దని వారు సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు కానీ పోలీస్ కంట్రోల్ నంబర్ 87126 59111, టోల్‌ఫ్రీ నంబర్ 1077తో పాటు 90632 11298 నంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్, సీపీ తెలిపారు.

# డెంగీతో ఒకరు మృతి

**మృతురాలి కుమార్తె కూడా ఆస్పత్రిలోనే...**


శ్రీదేవి (ఫైల్)

తల్లాడ: డెంగీ జ్వరం బారిన పడిన తల్లాడకు చెందిన యోగా శిక్షకురాలు కందుల శ్రీదేవి(32) గురువారం మృతి చెందారు. ఆమెకు మూడు రోజుల క్రితం జ్వరం రాగా స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈమేరకు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్రీదేవి తల్లాడ ఆయుష్ శాఖలో యోగా శిక్షకురాలిగా పనిచేస్తుండగా ఆమె కుమార్తె యశశ్రీ, మేనల్లుడు దుట్టా నిశాల్ సైతం వైరల్ జ్వరంతో చికిత్స పొందుతున్నారు. అయితే, కుమార్తె చికిత్స పొందుతుండడంతో శ్రీదేవి మృతి విషయం చెప్పకుండానే అంత్యక్రియలు పూర్తిచేశారు. తల్లాడలోని వీధులన్నీ బురదమయమై, చెత్తాచెదారంతో పేరుకుపోవడంతోనే జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### సైబర్ మోసంలో నిందితుడి అరెస్ట్


నిందితుడితో సైబర్ క్రైమ్ పోలీసులు

ఖమ్మంక్రైం: హ్యూమన్ ట్రాఫికింగ్, మనీ లాండరింగ్ కేసు నమోదైందని బెదిరిస్తూ ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడి నుంచి రూ.లక్షల్లో నగదు కాజేసిన నిందితుడిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు పోలీసులమని చెబుతూ ఏపీలోని అన్నమయ్య జిల్లా వాసి దామ విజయ్‌కుమార్ ఈ ఏడాది ఏప్రిల్ రిటైర్డ్ ఉపాధ్యాయుడికి ఫోన్ చేశాడు. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని పలు దఫాలుగా రూ.26లక్షలు తన ఖాతాలో జమ చేయించుకున్నాడు. ఈ విషయమై విచారణ చేపట్టి నిందితుడిని ఆయన స్వస్థలంలో అరెస్ట్ చేశామని సైబర్ క్రైం పోలీసులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

### గంజాయితో పట్టుబడిన యువకులు

కామేపల్లి: నలుగురు యువకులు గంజాయితో పట్టుబడగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కొత్తలింగాల – జాస్తిపల్లి మార్గంలో బుధవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన చల్లా మహేశ్, హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన బైరబోయిన శ్రావణ్, తిరుమలాయపాలెం మండలం దానవాయిగూడెంకు చెందిన బత్తుల హరీశ్, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటకు చెందిన బానోత్ సాయిగా గుర్తించగా గంజాయి లభించింది. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై సాయి కుమార్, సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

# పోక్సో కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్/కూసుమంచి: నాలుగేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా పోక్సో–2 కోర్టు ఇన్‌చార్జ్ న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పు వెలువరించారు. కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన యాభై ఏళ్ల వృద్ధుడు బానోత్ రాములు 2023 ఆగస్టు 15న అదే తండాకు చెందిన నాలుగేళ్ల బాలిక ఆమె ఇంటి వద్ద ఆడుకుంటుండగా మామిడికాయలు ఇస్తానంటూ మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. ఈ క్రమాన చిన్నారిపై లైంగిక దాడి చేయగా, బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కూసుమంచి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం రాములుపై నేరం రుజువైనందున జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు ప్రాసిక్యూటర్ మహ్మద్ ఇర్షాద్ వాదించారు. కాగా, నిందితుడికి కేసు పడేలా పకడ్బందీగా చార్జీషీట్ దాఖలు చేసిన నాటి, ప్రస్తుత ఏసీపీలు బస్వారెడ్డి, తిరుపతిరెడ్డితో పాటు నాటి ఎస్సై రమేష్, ఉద్యోగులు రాణి, గోపీకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, చిట్టిబాబును సీపీ సునీల్‌దత్ అభినందించారు.

# 'పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్న కేంద్రం'

తిరుమలాయపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులను అంతం చేస్తామని రక్తపాతం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే సమయాన ప్రశ్నించిన వారిపై నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని విమర్శించారు. కేంద్రప్రభుత్వమే కాక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రప్రజలకు ఇచ్చిన ఏ హామీని సంపూర్ణంగా అమలుచేయడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, బండెల వెంకయ్య, రాయల రవికుమార్, నాగేశ్వరరావు, పులిగుజ్జు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, సరోజన, అరెంపుల వెంకన్న పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుకు చెందిన మేడ శ్రీను(59) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉండగా, కొద్దిరోజులుగా గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈమేరకు బుధవారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగిన శ్రీనును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తిరుమలాయపాలెం పోలీసులు తెలిపారు.

# యువకుడి మృతితో ఉద్రిక్తత


యువకుడి బంధువులతో చర్చిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి వద్ద ఏటీలో గల్లంతైన మృతదేహం మృతదేహం గురువారం లభ్యమైంది. ఇటీవల వర్షాలతో ఏటిలో వరద పెరగగా స్థానిక రైతు ఒకరు ఏటి ఒడ్డున ఉన్న వ్యవసాయ మోటార్ తీయించేందుకు బుధవారం నలుగురికి తీసుకెళ్లాడు. ఇందులో గ్రామానికి చెందిన సిద్దెల ఆదిత్య(19) కూడా ఉండగా మోటార్ తీసే క్రమాన ఆయన వరదలో కొట్టుకుపోయాడు. దీంతో మిగతా వారు పారిపోయాడు. అయితే, రాత్రి వరకు ఆదిత్య ఇంటికి తిరిగి రాకపోవటంతో కుటుంబీకులు ఆయన స్నేహితులను నిలదీయగా విషయం బయటపడింది. గ్రామస్తులు రాత్రంతా వెతికినా ఆచూకీ లభించకపోగా గురువారం ఉదయం మృతదేహం బయటపడింది. ఈతమేరకు మృతికి కారకులకు రప్పించాలని కుటుంబీకులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈమేరకు పోలీసులు చేరుకుని వారికి నచ్చచెప్పడంతో పాటు కేసు నమోదు చేశారు.

### విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మధిర: పొలంలో మేస్తున్న గేదెలు విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాయి. మండలంలోని ఆత్కూరులో రైతు బట్ట కృష్ణకు చెందిన రెండు గేదెలు గురువారం మేతకు వెళ్లాయి. అయితే, స్తంభాలు లేకుండా కర్రలకు విద్యుత్ తీగలను వేలాడదీయడంతో కిందకు జారిన వాటిని గేదెలు తాకాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినందున బాధితుడికి పరిహారం చెల్లించడమేకాక విద్యుత్ లైన్లను సరిచేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.